

సాక్షి
ఒడిశా
సోమవారం । 4 । నవంబర్ । 2024


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,99,329లు, బంగారం 12 గ్రాముల 840 మిల్లీగ్రాములు వెండి 39 గ్రాముల 920 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.


చర్చలు సానుకూలమేనా..?
మహానదిపై చర్చలు జరుగుతున్నాయి. సఫలమైతే దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.
- 8లో.


ఘనంగా వార్షికోత్సవం
ఏఐటీయూసీ వార్షికోత్సవం జయపురంలో ఘనంగా జరిగింది. కార్మిక పతాకాన్ని ఎగురవేశారు.
- 8లో.


న్యూస్‌రీల్

ముర్గుమాతకు భక్తిశ్రద్ధలతో పూజలు


ముర్గుమాతకు పూజలు చేస్తున్న కిన్నెరలు

జయపురం: జయపురంలో కిన్నెర సంఘం (నపుంసకుల సంఘం) సభ్యులు దేవతగా కొలిచే ముర్గుమాతకు శనివారం సాయంత్రం నుంచి ఘనంగా పూజలు ప్రారంభించారు. జయపురం బైపాస్ రోడ్డులో ముర్గుమాత పూజలు చేశారు. ముర్గుమాతను బహుతారి మాతగా కూడా పిలుస్తామని వెల్లడించారు. మంగళవారం వరకు సంప్రదాయబద్ధంగా పూజలు చేసిన అనంతరం మాతను నిమజ్జనం చేస్తామన్నారు. పూజలు సందర్భంగా జయపురం కిన్నెరలు ఇతర జిల్లాల కిన్నెరలను ఆహ్వానించారు. తమ పూర్వ పురుషుల నియమం ప్రకారం ఈ పూజలు చేస్తున్నామని కిన్నెరల నేత గంగా పాణిగ్రహి పేర్కొన్నారు. ఈ పూజలు చేస్తే తమకు సకల ఆయురారోగ్యాలు కలుగుతాయని.. అలాగే సమాజానికి ఎంతో మేలు కలుగుతోందనే నమ్మకం ఉందని గంగా పాణిగ్రహి చెప్పారు.

రాజధానిలో స్వల్ప భూకంపం!


రెక్టార్ స్కేల్‌పై నమోదైన భూకంప తీవ్రత

భువనేశ్వర్: ఒడిశా రాజధాని నగరమైన భువనేశ్వర్‌లో ఆదివారం ఉదయం స్వల్పంగా భూమి కంపించింది. ఉదయం 7.17 గంటల సమయంలో స్వల్పంగా కొన్ని సెకన్లు మాత్రమే ఈ పరిస్థితి నెలకొంది. ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగు తీశారు. నగరం పరిసర ప్రాంతాల్లో ప్రకంపన తీవ్రత కనిపించింది. అదృష్టవశాతు దీని వలన ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. అయితే భూ ప్రకంపనలపై భారత వాతావరణ శాఖ అధికారికంగా ఎటువంటి ప్రకటన జారీ చేయలేదు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద ధీరజ్ మృతదేహం

మల్కాన్‌గిరి: మల్కాన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంపీవీ 25 గ్రామంలో ధీరజ్ రౌయి(30) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నారు. శనివారం రాత్రి రాత్రి ధీరజ్‌కు అతని భార్య ఔమాకు గొడవలయ్యాయి. దీంతో ఆయన ఆదివారం ఇంటి వెనుక మామిడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఈ దృశ్యాన్ని చూసిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఐసి చంద్రకాంత్ తండ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దింపు విచారించారు. మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మేఘనాథ్ ప్రహరీకి బీటలు


మేఘనాథ్ ప్రహరీ నుంచి చిమ్ముతున్న నీరు

భువనేశ్వర్: ప్రాచీన శ్రీ జగన్నాథ దేవస్థానం ప్రహరీ మేఘనాథ్ గోడలు బీటలు వారినట్లు గుర్తించారు. ఈ గోడల నుంచి నీరు చిమ్మడంతో ఈ పరిస్థితి స్పష్టమైంది. దీనిపై పలు అపోహలు వ్యాప్తి చెందుతున్నాయి. శ్రీ మందిరం ప్రాకార ప్రాజెక్టు పనులు సందర్భంగా జేసీబీ తాకిడితో ఈ పరిస్థితి తలెత్తినట్లు ప్రధాన ఆరోపణ కలకలం రేపుతుంది. మరో వైపు శ్రీ మందిరం లోపలి ప్రాంగణం ఆనంద బజారు ప్రాంతంలో వినియోగించిన నీరు ప్రవహించడంతో దీర్ఘకాలంలో ఈ పరిస్థితి అనివార్యమైనట్లు అధికార వర్గాల భోగట్టా. దీంతో గోడలు నాచుబారి క్రమంగా నీరు చిమ్మడం ఆరంభమైనట్లు భావిస్తున్నారు. నిర్వహణ కార్యకలాపాల్లో భాగంగా గుర్తించినట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ ఈ పనులు పర్యవేక్షిస్తుందన్నారు. త్వరలో అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు.

ఉత్సాహంగా... డ్యాన్స్ పోటీలు



సీనియర్ సోలో డ్యాన్సులో ప్రథమ విజేత అనంత గోమాంగో


సీనియర్ సోలో డ్యాన్సులో సంప్రదాయ నృత్యం

పర్లాకిమిడి:

మిరాకిల్ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టౌన్ హాలులో రాష్ట్ర స్థాయి సోలో, గ్రూప్, సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, జిల్లా శిశు సురక్షా అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, క్రియేటివ్ ఆర్ట్స్ కార్యదర్శి ఆదర్శదాస్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్‌లు పాల్గొన్నారు. డ్యాన్సు నేర్చుకుని ప్రావీణ్యం సంపాదించి తల్లి దండ్రులకు, ఈ జిల్లాకు పేరుతేవాలని పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పోటీలను మిరాకిల్ డ్యాన్స్ స్టూడియో డైరక్టర్ సుబేంధు మోహన్ సేనాపతి నిర్వహించగా న్యాయనిర్ణేతలుగా అపర్ణా మహారాణా, ఆయేషా పాత్రో (బరంపురం)లు వ్యవహరించారు. పోటీలకు మొత్తంగా 226 ఎంట్రీలు రాగా వారిలో రాయగడ, బోలంఘీర్, కోరాపుట్, ఆంధ్రప్రదేశ్, జయపురం, గంజాం జిల్లా బరంపురం నుంచి అభ్యర్థులు పాల్గొన్నారు



డ్యాన్స్ పోటీల్లో కిడ్స్ విభాగంలో చిన్నారి

విజేతలు వీరే..

కిడ్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు యస్.విధాత్రి, ఆర్.శ్రీయా, జి.రజ్వికలులు గెలుచుకోగా, జూనియర్ సోలో డ్యాన్సులో ఆషాప్రియా పండా ప్రథమ, అశ్లేషా పాణిగ్రాహి ద్వితీయ, కె.అశ్వినీ (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. ఇక సీనియర్ సోలో డ్యాన్సు విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా అనంత గోమాంగో, యాస్ హియాల్, ఈశ్వర్ శోబోరోలు గెలుచుకున్నారు. విజేతలకు నవంబరు 17లో ఎస్.కె.సీ.జీ.కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో బహుమతి ప్రదానోత్సవం జరుగునని కోడైరక్టర్ విష్ణుప్రియా జెన్నా తెలియజేశారు. కార్యక్రమాన్ని శుభ్రాంశు పండా, వ్యాఖ్యాతగా మనోజ్ కుమార్ పట్నాయిక్‌లు వ్యవహరించారు.


బిజీబిజీగా న్యాయ నిర్ణేతలు


డ్యాన్సు పోటీలకు ఇతర జిల్లాల నుంచి విచ్చేసిన పోటీదారులు



కిడ్స్ డ్యాన్స్‌లో విజేత ఆర్.శ్రీయ



సీనియర్ సోలో డ్యాన్సు విభాగంలో విజేతలను ప్రకటిస్తున్న సుభేంధు మోహన్ సేనాపతి

ప్రజల పక్షాన ఉంటాం


మాట్లాడుతున్న రమేష్ మజ్జి, వేదికపై ప్రదిప్ మజ్జి, మనోహర్ రంధారి

- బీజేడీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి

కొరాపుట్: తాము ఎన్నికలలో ఓడిపోయినా ప్రజలతోనే ఉంటామని నబరంగ్‌పూర్ బీజేడీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి ప్రకటించారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా మైదల్‌పూర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. తాము ఎన్నికల ముందు ప్రతీరోజు ప్రజలతోనే ఉన్నామని, ఎన్నికలలో ఓడిపోయినా ఒక్క రోజు కూడా విశ్రాంతి లేకుండా ప్రజలతోనే ఉన్నామని పేర్కొన్నారు. గత 25 ఏళ్లలో ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్ చేసిన అభివృద్ధి పనులు.. గత 4 నెలలుగా జరుగుతున్న అభివృద్ధి పనులను బేరీజు వేసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రజల గోడు వినే నాథుడే కరువయ్యాడన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ వద్దకు సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వెళ్లడం లేదన్నారు. ఓడిపోయిన బీజేడీ నాయకుల వద్దకు ప్రజలు వస్తున్నారన్నారు. ఈ సమావేశంలో డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, జెడ్పీ చైర్మన్ మొతిరాం నాయక్, మాజీ ఎంపీ ప్రదిప్ మజ్జి తదితరులు పాల్గొన్నారు.


హాజరైన కార్యకర్తలు

రెండు బైక్‌లు ఢీ: నలుగురికి గాయాలు


కలిమెల ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మల్కాన్‌గిరి: మల్కాన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ 68 కూడలి వద్ద ఆదివారం మధ్యాహ్నం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని నలుగురు గాయపడ్డారు. కలిమెల సమితి కోయిమేట్ల పంచాయతీ ఎంపీవీ 33 గ్రామానికి చెందిన అజయ్ సన, ఎంవీ 74 గ్రామానికి చెందిన మెలిల్ బిమా ఒక బైక్‌పై వస్తున్నారు. అలగే కలిమెల గిరిజన కాలనీకి చెందిన ముట కారామి, పోదియ మాడీ ఇద్దరూ మరో బైక్‌పై ఇంటికి వస్తుండడా ఎంవీ 68 కూడలి వద్ద ఈ రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో నలుగురూ గాయపడ్డారు. స్థానికులు వీరిని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని రైస్‌మిల్లర్లు వినతి

జయపురం: తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా రైస్‌మిల్లర్ల యజమానులు కోరారు. ఈ మేరకు రైస్ మిల్లు యజమానుల సంఘ ప్రతినిధులు జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతిని ఆదివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో గిడ్డంగుల కొరత కారణంగా సివిల్ సప్లై విభాగం మిల్లర్ల నుంచి బియ్యం తీసుకోవటంలేదని వారు ఆరోపించారు. ఈ కారణంగా ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు, బియ్యం టార్గెట్ నిర్ణయించినప్పటికీ తాము మిల్లింగ్ చేసిన బియ్యాన్ని గిడ్డంగుల కొరత కారణంగా సంబంధిత అధికారులు తీసుకోవటంలేదన్నారు. దీంతో తామంతా సమస్యలను ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యం మిల్లింగ్ చేసిన బియ్యంలో కేవలం 20 శాతం మాత్రమే మిల్లర్ల నుంచి తీసుకున్నారని వెల్లడించారు. ఖరీఫ్ మండీలలో మిల్లు యజమానులు ధాన్యం కొనుగోలు చేసి అక్టోబర్ నాటికి వంద శాతం మిల్లింగ్ బియ్యం ఇవ్వకపోతే 2024–25 ఖరీఫ్ మండీలలో మిల్లర్లు పాల్గొన లేరని ప్రభుత్వం నిబంధన విధించిందన్నారు. తమ సమస్యపై అధికారులతో చర్చించి పరిష్కరించాలని రైస్ మిల్లు ఓనర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు గిరిజ శంకర సాహు, ఉపాధ్యక్షులు తరణి పాత్రో, కార్యదర్శి గోపాల పండ కోరారు.


ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతికి వినతి పత్రం అందజేస్తున్న రైస్ మిల్లర్ల అసోషియేషన్ యాజమాన్య సంఘం ప్రతినిధులు

సంప్రదాయ పోటీలు ప్రారంభం


తరుణ ప్రజ్ఞా భారతి నిర్వాహక బృందం

జయపురం: స్థానిక తరుణ ప్రజ్ఞా భారతి సంస్థ ఆదివారం సంప్రదాయ పోటీలకు శ్రీకారం చుట్టింది. స్థానిక ఎన్‌కేటీ రోడ్డులోగల నారాయణీ ఆంగ్ల కళాశాల ప్రాంగణంలో సూర్యనమస్కారాలు, యోగాసనాలు, శంఖపూరణ, హుళిహుళి శబ్దాల పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు, మహిళలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరుణ ప్రజ్ఞ భారతి అధ్యక్షుడు తపన కిరణ్ త్రిపాఠీ, ఉపాధ్యక్షుడు రామ శకర షాడంగి, కార్యదర్శి సువర్ణ కుమారి ఖిలోలతో పాటు సభ్యులు అజయ కుమార్ మల్లిక్, రవీంద్ర మహరాణ, సబిత త్రిపాఠీ, లిపిక దొలాయి, పోటీల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించారు. న్యాయ నిర్ణేతలుగా జానకీ పాణిగ్రహి, అంబికా రంజన్ పాణిగ్రహి, కృష్ణా రావు దొర, నళినీ మహాపాత్రో, శుభశ్మిత సాహు, సుచిశ్మిత సాహు, సునీత మిశ్ర,రీతాంజళీ దాకువ పాల్గొన్నారు. ఈ నెల 10న చిత్ర లేఖనం, ప్రాచీన పురాణ గాథలు, చరిత్రపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.


యోగా పోటీల్లో పాల్గొన్న వారు


పోటీల్లో పాల్గొన్న మహిళలు

కూరగాయల దుకాణాలు దగ్ధం


డెలాంగు సంతలో కాలిపోయిన కూరగాయల దుకాణం

భువనేశ్వర్: రెండు వేర్వేరు చోట్ల జరిగిన అగ్ని ప్రమాదాల్లో కూరగాయల దుకాణాలు దగ్ధమయ్యాయి. పూరీ జిల్లా డెలాంగు గ్రామం సంతలో దుకాణానికి శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో షాపు కాలిబూడిదైంది. అంగుల్ జిల్లాలో వంట గ్యాస్ సిలిండరు పేలి 30 దుకాణాలు, గోదాం గదులు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో లక్షలాది విలువైన వెల్లుల్లి, ఉల్లి తదితర కూరగాయలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకొచ్చింది.


అంగుల్ జిల్లాలో దగ్ధమైన షాపులు


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు


గాయపడిన సాయికుమార్

కాశీబుగ్గ: మందస మండలం హరిపురంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాల పాలయ్యాడు. హరిపురం గ్రామానికి చెందిన పి.సాయికుమార్ ఆదివారం ఉదయం పెద్ద వీధిలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. కాగా, అనేక చోట్ల ప్రభుత్వ లైన్‌మేన్లు పనిచేయకుండా ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని పనులు చేయిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

26న రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ


మాట్లాడుతున్న వేదిక కమిటీ సభ్యులు

శ్రీకాకుళం: ఈ నెల 26న జరిగి రాజ్యాంగ దినోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం ఇలిసిపురంలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ ఈ నెల 26న మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు కె.వి.జగన్నాథరావు, నల్లి ధర్మారావు, మిస్క కృష్ణయ్య, పేడాడ కృష్ణారావు, డి.గణేష్, కోత ధర్మారావు, బి.బుద్ధుడు, వంకల మాధవరావు, లింగాల అప్పన్న, ఎం.ఫల్గుణరాజు, కూన రామం, చింతాడ కృష్ణారావు, రాకోటి రాంబాబు పాల్గొన్నారు.

ఏపీపీఆర్‌డీఈ సంఘ జిల్లా అధ్యక్షుడిగా మహంతి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర


అరసవల్లి: ఏపీ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజినీర్ల సంఘ జిల్లా అధ్యక్షుడిగా కేసీహెచ్ మహంతి ఎన్నికయ్యారు. స్థానిక జెడ్పీలో ఆదివారం నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఆయన ఏకంగా 13వ సారి ఎన్నికై రికార్డు సృష్టించారు. రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కె.రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో జిల్లా ఉపాధ్యక్షునిగా ఎం.పోలినాయుడు, కార్యదర్శిగా ఎస్‌వీపీ పోలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.రమేష్, కోశాధికారిగా బి.కృష్ణారావు, గౌరవ సలహాదారునిగా రిటైర్డ్ ఇంజినీర్ పల్లె నర్సింహులు ఎన్నికయ్యారు.

సత్యసాయి క్రికెట్ టోర్నీ విజేత పలాస


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ఫైనల్ పోటీలు నిర్వహించారు. పలాస జట్టు నరసన్నపేట జట్టుపై విజయం సాధించి కప్ కైవసం చేసుకుంది. విజేతలకు సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారుల ప్రతిభ


రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. సత్యసాయి జిల్లాలోని లేపాక్షి జవహర్ నవోదయ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అండర్-14 బాలబాలికల టీమ్ ఈవెంట్‌లో శ్రీకాకుళం 4వ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో పలాసకు చెందిన కె.కల్పక్ 7వ స్థానం, ఎచ్చెర్ల జీహెచ్‌స్కూల్‌కు చెందిన బి.యశ్వంత్ 8వ స్థానంలో నిలిచారు. వీరిద్దరు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన స్టాండ్‌బైలో చోటు దక్కించుకున్నారు. బాలికల విభాగంలో ఎచ్చెర్ల జీహెచ్ స్కూల్‌కు చెందిన బి.శృతి 9వ స్థానంలో నిలిచింది.

మహానదిపై చర్చలు సానుకూలమేనా..?

- త్వరలో కొలిక్కి వస్తుంది: ముఖ్యమంత్రి
- కంటి తుడుపు వైఖరి: కాంగ్రెసు
- పరిష్కార సంప్రదింపులు బహిరంగపరచాలి: ఎమ్‌బీఏ

భువనేశ్వర్: రాష్ట్ర ప్రజలకు మహా నది జీవనాధారం. ఎగువ చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆగడాలతో గత కొన్నేళ్లుగా లోతట్టు ఒడిశాకు మహానది జలాలు అందకుండాపోతున్నాయి. వానాకాలంలో వరద నీరుతో ప్రాంతీయులకు ముంపు మినహా వేసవి కాలంలో నీరు కొరవడుతోందని వాపోతున్నారు. ఈ సమస్య ఎన్నటికీ కొలిక్కి రావడం లేదు. ఇప్పుడు చత్తీస్‌గఢ్, ఒడిశా రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ సర్కారు ఉంది. దీంతో ఈ వివాదం ఓ కొలిక్కి వస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఇటీవల పశ్చిమ ఒడిశా బొలంగీరు జిల్లా పర్యటన పురస్కరించుకుని మహా నది జలాల పంపిణీ వివాదంపై పెదవి కదిపారు. ఆయన వ్యాఖ్యలతో ఈ విషయమై రాష్ట్ర రాజకీయ శిబిరాల్లో చర్చ ఊపందుకుంది. మహా నది ఎగువ భాగంపై యథేచ్ఛగా కొనసాగుతున్న నిర్మాణాలు, కట్టడాలకు క్లెం వేయకుంటే లోతట్టు ప్రాంతాల వెతలకు తెరపడే అవకాశం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యాప్తిలో ఉంది. ఈ పరిస్థితి మోహన్ చరణ్ మాఝి సర్కారుకు పెను సవాలుగా నిలుస్తుంది.

చర్చలు సానుకూలం

ఎగువ రాష్ట్రం చత్తీస్‌గఢ్ రాష్ట్ర ముఖ్యమంత్రితో మహా నది జలాల పంపిణీ విషయమై ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రస్తావన పట్ల సానుకూల స్పందన లభించిందని ముఖ్యమంత్రి అభయం ఇచ్చారు. అయితే ఈ ప్రస్తావన అంశాలు తేటతెల్లం చేయకపోవడంతో సర్వత్రా పలు సందేహాలు తలెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నీటి మూటల హామీలు రాష్ట్ర ప్రజల్ని బురిడీ కొట్టిస్తున్నాయని ప్రతిపక్ష బీజేడీ ఆరోపిస్తోంది. ఆయనతో చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి పోకడ కేవలం కంటి తుడుపు వైఖరి మాత్రమేనని కాంగ్రెసు సీనియర్ నాయకుడు, బొలంగీరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నరసింగ మిశ్రా వ్యాఖ్యానించారు. చర్చలు, సంప్రదింపులతో తాత్కాలిక పరిష్కారం జలాల పంపిణీ వివాదం తొలగించలేమని బాహాటంగా ప్రకటించారు. నిర్మాణాత్మక శైలిలో చట్టపరంగా ఈ వివాదాన్ని పరిష్కృతం చేయడం శాస్వత పరిష్కారం అవుతుందన్నారు. లోగడ ఇటువంటి సన్నాహకాలు బెడిసి కొట్టడంతో వివాదం ట్రిబ్యునల్ పరిధిలోకి చేరిన విషయం విదితమే.

చర్చల గుట్టు ఏమిటో..?

రాష్ట్ర ప్రజల జీవనాధార మహా నది జలాలపై పూర్తి స్థాయి హక్కులు కల్పించే దిశలో చర్యలు చేపట్టడం అనివార్యం. చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ఈ విషయంలో సానుకూలంగా స్పందించారు. త్వరలో సమస్య తొలగిపోతుందని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం వెనక సంప్రదింపుల సారాంశం ఏమిటో బహిరంగ పరచాలని మహా నది బచావ్ ఆందోళన్ ఎమ్‌బీఏ వర్గం నిలదీసింది. ఈ నేపథ్యంలో లోగడ కేంద్ర ప్రభుత్వం రాయబారంలో ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిపిన చర్చలు నిలువునా విఫలం అయ్యాయి. ఎగువ భాగంలో చత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం యథేచ్ఛగా బ్యారేజిలు ఇతరేతర కట్టడాలు కొనసాగిస్తుంది. దీంతో లోతట్టు ఒడిశాకు వేసవి కాలంలో నీటి విడుదల కొరవడుతుంది. ఈ వైపరీత్యపు చర్యల పట్ల రాష్ట్రంలో గత ప్రభుత్వం న్యాయ స్థానాల్ని ఆశ్రయించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 2018 సంవత్సరంలో మహా నది జలాల పంపిణీ వివాద ట్రిబ్యునల్ ఏర్పాటైంది. సుమారు 7 ఏళ్లు పూర్తి కావస్తున్న దీని ప్రభావం శూన్యమే. అత్యధిక సమయం ట్రిబ్యునల్ చైర్మన్ పదవి ఖాళీగా కొనసాగడంతో ఈ పరిస్థితి తాండవిస్తుందనే ఆరోపణ ప్రచారంలో ఉంది.

ఘనంగా ఏఐటీయూసీ వార్షికోత్సవం


కార్మిక పతాకాన్ని ఎగుర వేస్తున్న ప్రమోద్ మహంతి

జయపురం: దేశంలోనే మొదటి కార్మిక సంఘం ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ (ఏఐటీయూసీ) కార్మికులు, శ్రామికులు, ప్రజల హక్కుల కోసం నిర్విరామంగా పోరాటం చేస్తోందని ప్రముఖ కార్మిక నేత ప్రమోద్ మహంతి అన్నారు. ఏఐటీయూసీ 105వ వార్షికోత్సవాన్ని స్థానిక కార్మిక భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్మిక పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేసించి ప్రసంగిస్తూ.. కొరాపుట్ జిల్లాలో సేవా పేపరుమిల్లు కార్మికుల న్యాయమైన హక్కుల కోసం, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్మికుల సమస్యలపై పోరాటాలు సాగిస్తుందన్నారు.

కార్మికులకు కనీస వేతనం, గ్రాట్యుటీ, పెన్షన్ కోసం ఏఐటీయూసీ జరుపుతున్న పోరాటాలు కార్మికులకు తెలుసున్నారు. సేవా పేపరు మిల్లు పూర్తిస్థాయిలో నడపాలని జిల్లా అధికాలను, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆందోళనలు కొనసాగిస్తుందన్నారు. ధరలు పెరుగుదలపైన, నిరుద్యోగ సమస్యపైన, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపైన ఉద్యమాలు చేస్తున్నామని వివరించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాటంలే అంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు బసంత బెహర, కె.సత్యనారాయణ, అలేఖ్ పాత్రో, నారాయణ సాహు తదితరులు పాల్గొన్నారు.

కబాడి సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్


సెన్సార్ బోర్డు సర్టిఫికెట్‌తో సినీ నిర్మాత, డైరెక్టర్ తదితరులు


ఉత్సవంలో పాల్గొన్న కళాకారులు

జయపురం: స్థానిక సాయి ఫిల్మ్ వారు చిత్రీకరించిన కొరాపుటియ సినిమా ‘కబాడి’కి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ లభించింది. దీంతో సినీ కళాకారులు ఆదివారం స్థానిక ఎస్ఆర్ మాల్ సభాగృహంలో ఉత్సవం జరుపుకున్నారు. సినిమా డైరెక్టర్ అమర మిశ్ర అధ్యక్షతన జరిగిన ఉత్సవంలో ముఖ్యఅతిథిగా ప్రముఖ కళాకారుడు గోపాల కృష్ణ సామంతరాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబాడి సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ లభించటం అనందంగా ఉందన్నారు. ఈ స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని సినిమాలు తీసేందుకు నిర్మాతలు, కళాకారులు ఉత్సాహంగా ముందుకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా డైరెక్టర్ అమర మిశ్ర మాట్లాడుతూ.. కబాడి సినిమాను డిసెంబర్ ఆఖరి వారంలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రజల జీవన ఇతివృత్తంతో సినిమాన చిత్రకరించామన్నారు. కార్యక్రమంలో కావేరీ మిశ్ర, కిశోర్ మిశ్ర, రవీంద్ర రౌత్, గాయకుడు హ్యూమన్ సాగర్, దీప్తి రేఖ పాఢీ, మానస రంజన్ పండ, రిస్థ మహంతి, సీతాకాంత ప్రధాన్, బిజయ పాణిగ్రాహి పాల్గొన్నారు.

ఫిబ్రవరి 9న కటక్‌లో వన్డే క్రికెట్ మ్యాచ్


కటక్ బారాబటి స్టేడియం



సమావేశంలో పాల్గొన్న ఓసీఏ సభ్యులు

భువనేశ్వర్: కటక్ బారాబటి స్టేడియం వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య ఫిబ్రవరి 9న వన్ డే మ్యాచ్ జరగనుందని ఒడిశా క్రికెటు అసోసియేషన్ కార్యదర్శి సంజయ్ బెహరా తెలిపారు. ఆదివారం బారాబటి స్టేడియం ఓసీఏ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాచ్ టికెటు ధరలు ఖరారు చేశారు. 44 వేల 524 మంది మ్యాచ్ ప్రత్యక్షంగా తిలకించేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. టికెట్ ధరలు రూ.800 నుంచి గరిష్ఠంగా రూ.20000 వేలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రత్, ఇంగ్లండ్ జట్ల క్రీడాకారులు స్థానిక మే ఫెయిర్ లాగూన్‌లో బస చేస్తారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో హబిష్యాలీ దుర్మరణం


దుర్ఘటనపాలైన ఆటో

భువనేశ్వర్: పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని శ్రీ జగన్నాథుని దర్శించుకునేందుకు వెళ్తుండగా హబిషాలీ దుర్మరణం పాలైంది. ఆదివారం ఈ విషాద సంఘటన సంభవించింది. పూరీ జిల్లా చందేశ్వర్ దీక్షిత్ పాడా ప్రాంతం 16వ నంబరు జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్న ట్రక్కుని ఆటో ముందు భాగం ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. ఈ సంఘటనలో 60 ఏళ్ల సుష్మా సామంత్రాయ్ మరణించింది. ఆటో డ్రైవరు మిట్టు సేన్ (30), శశి గుమన్ సింగ్ (72), ఆశామణి సామంత్రాయ్ మరియు (65) సజనీ సామంత్రాయ్ (68) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

స్తంభాన్ని ఢీకొన్న కారు



భువనేశ్వర్: బొలంగీరు జిల్లా కంటాబంజి ప్రాంతం బెల్లపొడా మార్గంలో శనివారం అర్ధరాత్రి ఓ కారు వేగంగా వచ్చి రహదారి పక్కన ప్రహరీని దాటి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టింది. ఘటనలో డ్రైవరు సురక్షితంగా బయట పడడం విశేషం.

దుస్తుల పంపిణీ

పర్లాకిమిడి: బి.సీతాపురంలో గల ఉత్కళ బాలాశ్రమంలో అనాథ బాలలకు భోజనం, దుస్తులను పర్లాకిమిడికి చెందిన ఇస్పితా పట్నాయక్ అందజేశారు. ఎపర్లాకిమిడికి చెందిన బిబూసానంద పట్నాయక్ భార్య ఇస్పితా పట్నాయక్ కొంతకాలంగా జర్మనీలో ఉంటున్నారు. ప్రతీ ఏటా స్వగ్రామం పర్లాకిమిడి విచ్చేసి అనాథశ్రమాల్లోని చిన్నారులకు దుస్తులు, భోజనం అందజేస్తున్నారు. ఈ ఏడాది బి.సీతాపురంలో ఉన్న బాలాశ్రమానికి విచ్చేసి బాలలకు దుస్తులు, భోజనం అందించారు. అనంతరం కేక్ కట్‌చేసి బాలలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సురక్షా అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, బాలాశ్రమం అధ్యక్షురాలు ఎం.స్మృతి, కార్యదర్శి లోకనాథ పండా పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి చెస్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని పీఎన్‌కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 10, 12, 14 విభాగాల్లో ఆదివారం జిల్లాస్థాయి స్కూల్ ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 82 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలకు ఏపీ చెస్ అసోసియేషన్ కార్యదర్శి, ఆలిండియా చెస్ ఇన్ స్కూల్ కమిటీ సభ్యులు సనపల భీమారావు, చౌదరి నారాయణమూర్తి(బాబ్జి) అందజేశారు.

అధికారుల గైర్హాజరుపై శాప్ చైర్మన్ ఆగ్రహం


స్టేడియం పనుల వివరాలు తెలుసుకుంటున్న శాప్ చైర్మన్


శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో క్రీడాకారులకు ప్రోత్సాహకాలు కరవయ్యాయని.. సీఎంతో చర్చించి క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులు గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. వారికి సమాచారం చేరవేశారా లేదా అని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావుని అడగగా తనకు తెలియదన్నారు. దీంతో మీరేం చేస్తున్నారంటూ ఆయనపై అసహనం వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులు లేకుండా ఇక్కడకు వచ్చి ఏంచేయాలో చెప్పాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి మండిపడ్డారు. కోడిరామ్మూర్తి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ప్రగతిని పరిశీలించారు.

కైలాసాన కార్తీకాన శివరూపం!



కార్తీకం హిందువులకు ప్రీతిపాత్రమైన మాసం. ఈ నెల రోజులు అత్యంత పవిత్రమైన రోజులుగా భావిస్తారు. భక్తిశ్రద్ధలతో శివయ్యను వేడుకుంటే ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు సిద్ధిస్తాయని నమ్మకం. అందుకే ఈ మాసంలో మహిళలు వ్రతాలు, నోములు ఆచరిస్తారు. దీపారాధనకు కూడా అత్యంత ప్రాధాన్యమిస్తారు. ఈ నెల 4 నుంచి కార్తీక సోమవారాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన శివాలయాలైన శ్రీముఖలింగం దేవస్థానం, రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయం, శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- నేటి నుంచి కార్తీక సోమవారాలు ప్రారంభం
- ప్రధాన శివాలయాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు


శ్రీముఖలింగేశ్వరుని ప్రధాన ఆలయం



ముక్తికి మార్గం.. శ్రీముఖలింగం

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగం. ఎక్కడైనా శివుడు లింగాకారంలో ఉంటాడు. ఇక్కడ మాత్రం ముఖం దాల్చి ఆవిర్భవించాడు. అందుకే ఈ క్షేత్రానికి శ్రీముఖలింగమని, ఇక్కడ కొలువైన శివుడిని ముఖలింగేశ్వరుడని పిలుస్తారు. కాశిలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ జరిగే కార్తీక సోమవార పూజల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలలు నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తారు. ఈ ఏడాది కార్తీక పూజలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ ప్రభాకరరావు తెలిపారు.

ఇలా వెళ్లాలి..

శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి శ్రీముఖలింగం సుమారు 50 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఈ క్షేత్రం చేరుకునేందుకు శ్రీకాకుళం నుంచి రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి నరసన్నపేట నుంచి చల్లవానిపేట మీదుగా, మరొకటి కోమర్తి నుంచి ఉర్లాం మీదుగా శ్రీముఖలింగం చేరుకోవచ్చు. బస్సులు, కార్లు, ప్రైవేటు వాహనాల ద్వారా వెళ్లవచ్చు. రైల్లో వస్తే శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) స్టేషన్‌లో దిగాలి. అక్కడి నుంచి శ్రీకాకుళం వాహనాల ద్వారా చేరుకుని శ్రీముఖలింగం వెళ్లవచ్చు. ఆలయం ప్రతి రోజూ ఉదయం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ తెరిచి ఉంటుంది. అయితే భక్తులు, పర్యాటకులు ఉండేందుకు ఎటువంటి వసతి లేదు.

బలరామ ప్రతిష్ట.. ఉమారుద్ర ఆలయ ప్రత్యేకత


ఉమారుద్ర కోటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో అతిపురాతన దేవాలయంగా గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధిగాంచింది. బలరాముడు ప్రతిష్ఠించిన దేవాలయంగా ప్రఖ్యాతి చెందిన ఈ ఆలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమి(పంచరత్నా) రోజుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమావాస్య తదుపరివచ్చే త్రయోదశితో కూడిన చతుర్దశినాడు మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయి. నాలుగో సోమవారం స్వామివారికి 2016 రుద్రాక్షలతో పూజ చేసి అలంకరిస్తారు. ఉదయం 3 గంటల నుంచి ఆలయ ప్రవేశం, ప్రత్యేక పూజలు, భక్తుల రద్దీ బట్టి రుద్రాభిషేకాలు చేయిస్తారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాజరాజేశ్వరీ మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్రనామ పారాయణ ఉంటుందని అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, ఈఓ సర్వేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ శాఖ సహకారంతో నాగావళి నది ఒడ్డును పరిశుభ్రం చేయించినట్లు చెప్పారు.

కలియుగ కైలాసం.. ఎండల మల్లన్న ఆలయం


ఎండల మల్లికార్జునస్వామి

టెక్కలి: ప్రపంచంలోనే అతి ఎత్తయిన స్వయంభూ లింగం వెలిసిన ప్రాంతంగా టెక్కలి మండలం రావివలస గ్రామంలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయం ప్రఖ్యాతగాంచింది. కార్తీకమాసం సందర్భంగా ఈ నెల 4, 11, 18, 25వ తేదీలలో ప్రత్యేక పూజలను నిర్వహించడానికి ఆలయ అధికారులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు. జిల్లావాసులతో పాటు ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.మల్లన్నతో పాటు పక్కనే ఉన్న సీతకోనేరులో ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలతో పాటు కొండపై ఉన్న సీతమ్మ పాదాల పర్ణశాలలకు హంగులు దిద్దారు. వీటితో పాటు కొండపై వెలసిన లలితాదేవి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇలా వెళ్లాలి..

ఎండల మల్లికార్జునుడి ఆలయానికి చేరుకునేందుకు రోడ్డు, రైల్వే మార్గాలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నుంచి టెక్కలి చేరుకుని అక్కడి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి చేరుకునేందుకు బస్సులు, ఆటోల సదుపాయం ఉంది. రైల్వే విషయానికి వస్తే టెక్కలితో పాటు సమీపంలో సుమారు 5 కిలోమీటర్ల దూరంలో నౌపడ రైల్వే స్టేషన్, 20 కిలోమీటర్ల దూరంలో పలాస రైల్వే స్టేషన్‌కు రైలులో చేరుకుని అక్కడి నుంచి బస్సులు, చిన్నపాటి వాహనాల్లో ఆలయానికి చేరుకోవచ్చు.

క్లుప్తంగా

రైలులో నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన మనోజ్ తివారి

జామి: మండలంలోని యాతపాలెం సమీపంలో రైలులో నుంచి జారిపడడంతో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. ఒడిశా రాష్ట్రంలోని బరంపురానికి చెందిన మనోజ్ తివారి (40) రైలులో ప్రయాణిస్తూ జారిపడి తీవ్ర గాయాల పాలవడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది వచ్చి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారు.

హోంగార్డు మృతి



అప్పలనాయుడు మృతదేహం

వంగర: మండల పరిధి మగ్గూరు సమీపంలోని మడ్డువలస ప్రాజెక్టు డైక్ వద్ద శివ్వాం గ్రామానికి చెందిన హోంగార్డు పాదిలాపు అప్పలనాయుడు(53) మృతిచెందినట్లు ఏఎస్సై సూర్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న అప్పలనాయుడు స్వగ్రామం శివ్వాం వచ్చి ఈనెల 2వ తేదీన ఇంటి నుంచి విధులకు హాజరయ్యేందుకు బయల్దేరాడు. ఆదివారం ఉదయం మగ్గూరు సమీపంలో మడ్డువలస ప్రాజెక్టు డైక్‌ను ఆనుకుని హోంగార్డు మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గమనించి సమాచారం అందించారని ఏఎస్సై తెలిపారు. మద్యానికి బానిస కావడంతో అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని మృతుడి భార్య భారతి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాముకాటుతో రైతు మృతి



పాముకాటుతో మృతి చెందిన అల్లు రమేష్

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం గ్రామానికి చెందిన రైతు అల్లు రమేష్ (32) ఆదివారం మధ్యాహ్నం వరి పొలంలో చేను కోస్తుండగా పాముకాటుకు గురై మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కూలీలతో పాటు రమేష్ పొలంలో వరిచేను కోస్తుండగా పాము కాటు వేయడంతో వెంటనే ద్విచక్రవాహనంపై సాలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

మెంటాడ: మండలంలోని కొంపంగి బ్రిడ్జి వద్ద కాపుకాసి 20 బస్తాలు (సుమారు 900కేజీలు) బియ్యంతో ప్రయాణిస్తున్న ఆటోను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్సై సీతారాం తెలియజేశారు. ముందస్తు సమాచారంతో పట్టుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

దళారులకు ధాన్యం విక్రయం



దళారులకు విక్రయించిన ధాన్యం బస్తాలు

బలిజిపేట: ఖరీఫ్ వరిపంట కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ధాన్యం విక్రయాల కోసం అన్నదాతలు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ.2300 మద్దతు ధర ప్రకటించగా దళారులు రూ.1800లకు కొనుగోలు చేస్తున్నారు. తూకంలో తేడాలతో రైతులు మోసపోతున్నారు. 80 కిలోల బస్తాకు 4 కిలోలు చొప్పున ధాన్యాన్ని అదనంగా రైతుల నుంచి దళారులు తీసుకుంటున్నారు. కళ్లాల్లో ధాన్యం బస్తాలు నిల్వ చేయలేక, వాతావరణ పరిస్థితులకు భయపడి దళారులు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

అందాల గుహలో.. కొలువైన శివుడు



అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర ఆలయం

- అడ్డాపుశీలలో ఆధ్యాత్మిక శోభ
- ఒడిశా, శ్రీకాకుళం, విజయనగరం నుంచి భక్తుల తాకిడి

పార్వతీపురం టౌన్: శివుడికి ఎంతో ప్రీతికరమైన కార్తీకమాసం ప్రారంభమైంది. ఈ మాసంలో పార్వతీపురం జిల్లా కేంద్రానికి 4కిలోమీటర్ల దూరంలో అడ్డాపుశీలలో కొలువైన కాశీవిశ్వేశ్వరునికి రుద్రాభిషేకాలు, బిల్వార్చన, రుద్రపూజలు విశేషంగా చేస్తారు. అడ్డాపుశీలలో కొలువైన కాశీవిశ్వేశ్వరుడు పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రసిద్ధి గాంచిన సుప్రసిద్ధ దేవుడుగా పేరొందాడు. కార్తీక మాసంలో ప్రతీ సోమవారం ఈ ఆలయానికి వేలాది మంది భక్తులు పోటెత్తుతారు. దేవాదాయశాఖ ఆదీనంలో ఉన్న ఈ ఆలయంలో కాశీవిశ్వేశ్వరుడు నిత్య అరాధన, పూజలను అందుకుటున్నాడు. ఈ



కాశీ విశ్వేశ్వర శివలింగం

ఆలయ ప్రాంగణంలో కాశీవిశ్వేశ్వరునితోపాటు మరో 12 ఆలయాలు కూడా ఉన్నాయి. ఆలయ అభివృద్ధి దేవాదాయశాఖ చొరవతో మళ్లీ ఈ దేవాలయానికి కొత్త రూపువచ్చింది.

ప్రపంచంలోనే అతిపెద్ద నందివిగ్రహం

ఈ ఆలయ ప్రాంగణంలో 47 అడుగుల వెడల్పు, 42 అడుగుల ఎత్తు, 24 అడుగుల కైవారం గల అతి పెద్ద నంది విగ్రహాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్మించింది. దీని నిర్మాణంతో ఈ ప్రాంగణానికి కొత్త రూపు వచ్చింది. దీంతో భక్తులు తాకిడి కూడా పెరిగింది.



దేవాలయ ప్రాంగణంలో అతి పెద్దదైన మహానంది విగ్రహం



అడ్డాపుశీలలో నిర్మించిన ధ్యాన శంకరుని విగ్రహం

ఆలయానికి ఇలా చేరుకోవాలి

జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి వెళ్లాలంటే పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాలకొండ, కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఎక్కి అడ్డాపుశీల బస్టాప్ వద్ద దిగి అక్కడ నుంచి 600 మీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి చేరుకోవచ్చు. పార్వతీపురం నుంచి ఆటోల్లో కూడా చేరుకోవచ్చు. పార్వతీపురం , పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్‌లో దిగిన భక్తులు కూడా ఆటోల సహాయంతో గాని, బస్సుల్లో గాని చేరుకోవచ్చు.



ఆలయ ప్రాంగణంలోవున గణపతి దేవుని ఆలయం



ఆలయ ముఖద్వారం

కొండదారుల్లో గంజాయి!



పార్వతీపురం మన్యం జిల్లా మీదుగా గంజాయి, సారా రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. పోలీసులు నలువైపులా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు ముమ్మరం చేసినా.. గంజాయి రవాణా చేసేవారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నా.. తరలింపు మాత్రం ఆగడం లేదు. ఒడిశా సరిహద్దులోని కుగ్రామాల మీదుగా జిల్లాలోకి ప్రవేశించి ఇతర రాష్ట్రాలకు గంజాయిని తరలిస్తున్నారు. ఈ వ్యాపారంలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారే అధికమంది పట్టుబడుతుండడం గమనార్హం.

- ఒడిశా నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకు..
- అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా
- స్థానిక యువతకు బహుమతులతో ఎర
- తరలింపులో భాగస్వామ్యం చేస్తున్న వ్యాపారులు
- నిందితుల్లో ఎక్కువగా ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల వారే..

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి ఎటుచూసినా ఒడిశా సరిహద్దులే ఉండటం.. చుట్టూ ప్రాంతమంతా కొండకోనలే కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి సరిహద్దు వెంబడి గంజాయి సులువుగా ప్రవేశిస్తోంది. అక్రమార్కులు వివిధ మార్గాలను అన్వేషించడంతోపాటు.. స్థానిక గిరిజ న యువతకూ డబ్బులు, విలువైన వస్తువులు ఆశ చూపించి గంజాయిని ఎటువంటి ఇబ్బందులూ లేకుండా బోర్డర్ దాటించేస్తున్నారు. జిల్లా మీదుగా నే ఒడిశా, బెంగాల్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు గంజాయిని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఒడిశాను ఆనుకుని పి.కోనవలస, కూనేరు, బత్తిలి, గుణుపూర్ వద్ద అంతర్‌రాష్ట్ర తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం ఉండడం లేదు. సాలూరు మండలంలో పెద్దగా తనిఖీలు లేకపోవడం, పాచిపెంట మండలం సుంకి వద్ద నుంచి ఎక్కువగా ద్విచక్ర, ఇతర వాహనాలు మీదుగా జిల్లాలోకి ప్రవేశిస్తున్నారు. కొద్దిరోజుల కిందట ఒక వాహనాన్ని.. ఆర్మీకి చెందిన వాహనంలా తయారు చేసి మరీ గంజాయి తరలించడం గమనార్హం. ఇటీవల సరిహద్దును దాటుకొని ద్విచక్ర వాహనంపై వస్తున్న భార్యాభర్తలను తనిఖీ చేయగా.. వారి బ్యాగులో గంజాయి లభ్యమైంది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

కొండల మీదుగా...

- ఒడిశాలోని మల్కన్‌గిరి మీదుగా సరిహద్దులోని బత్తిలి వైపు నుంచి భామిని మీదుగా పాలకొండ ఇతర ప్రాంతాలకు రవాణా సాగుతోంది.
- కొమరాడ మండలం కూనేరు సరిహద్దుగా ఉంది. ఈ ప్రాంతం మీదుగా అటు నుంచి గంజాయి, మద్యం.. ఇటు నుంచి బియ్యం తదితరాలు పెద్ద ఎత్తున అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు సమాచారం. అందుకే కూనేరు పోలీస్‌స్టేషన్ అధికారి పోస్టుకు మంచి డిమాండ్ ఉంటుందన్న మాటలు తరచూ వినిపిస్తాయి.
- గుమ్మలక్ష్మీపురం మండలం తాటిశీల–గొట్లభద్ర, రామన్నగూడ, కురుపాం దగ్గర మూలిగూడ, కేదారిపురం.. ఇలా మూడువైపులా ఒడిశా సరిహద్దులే ఉన్నాయి. దీంతో అక్రమంగా గంజాయి, సారా వంటివి రవాణా అవుతుంటాయి.

ఇతర రాష్ట్రాలవారే నిందితులు

పార్వతీపురం జిల్లాలో 2023 నుంచి ఇప్పటివరకు 450 కిలోలకుపైగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాదిలో మొత్తం 28 కేసులు నమోదు కాగా.. 56 మందిని అరెస్టు చేశారు. 2019 నుంచి చూసుకుంటే, మొత్తం 147 మందిని అరెస్టు చేయగా.. ఇందులో 123 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారేనని అదనపు ఏఎస్పీ దిలీప్ కిరణ్ వెల్లడించారు. పి.కోనవలస, ఇతర ప్రాంతాల్లో డ్రోన్, స్నిఫర్ డాగ్‌తో ప్రయోగాత్మకంగానూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- పాచిపెంట, సాలూరు మండలంలోని సుంకి తదితర ఒడిశా సరిహద్దు ప్రాంతాలనూ అక్రమార్కులు వినియోగించుకుంటున్నారు.
- పార్వతీపురం మండలంలోని కొత్తవలస సమీపంలో ఒడిశా సరిహద్దు కలుస్తుంది. ఇటు నుంచి కొంతమంది తరలిపస్తారు.
- గుమ్మకోట మీదుగా ఆంధ్ర, మెంటాడ తదితర ప్రాంతాల నుంచి సాలూరు, పార్వతీపురం వైపు కొందరు గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం. ఇవి కాక, రైలు మార్గాలు అదనం. నిత్యం అనేక రైళ్లు ఒడిశా వైపు నుంచి వస్తుంటాయి. వీటిలో తనిఖీలు అంతంతమాత్రంగానే ఉండడంతో రవాణా పెద్ద ఎత్తున సాగిపోతోందన్న ఆరోపణలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి.

వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు



లక్ష్య సాధనపై గురి పెట్టాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సీతానగరం: చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు ఉన్నతమైన లక్ష్యంపై విద్యార్థులు గురిపెట్టి కఠోర శ్రమతో సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సీతానగరం మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులం మైదానం వద్ద జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి 68వ విలువిద్య స్కూల్‌గేమ్స్ పోటీలు ఆదివారం ఉల్లాసంగా ప్రారంభమయ్యాయి. పదమూడు జిల్లాల నుంచి పాల్గొన్న అండర్ 14, 17,19 విభాగాల బాలురు, బాలికల విలువిద్య పోటీల ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ విలువిద్య పోటీలకు మన్యం జిల్లా ఆతిథ్యం ఇవ్వడం ఆనందదాయకమన్నారు.

ఈ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి కనబరిచి ప్రతిభ చూపేందుకు మంచి అవకాశమని అభిప్రాయ పడ్డారు. సామర్థ్యాన్ని, అవకాశాలను ఏ మాత్రం వృథా చేసుకోకుండా క్రీడాకారులు ఏకాగ్రతతో నైపుణ్యాన్ని మెరుగుపరచుకుంటే విజయం దాసోహం అవుతుందంటూ వారిలో స్ఫూర్తి నింపారు. నిర్వాహకులు క్రీడాకారులకు కల్పించిన ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర విలువిద్య అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణను కలెక్టర్ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.తిరుపతి నాయుడు, విలువిద్య రాష్ట్ర పరిశీలకుడు ఎన్.వి.రమణ, ఉప విద్యాశాఖాధికారి రాజ్‌కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎం. మురళీకృష్ణ, సీతానగరం, పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారులు సూరిదేముడు, కర్రి ప్రసాదరావు, ప్రిన్సిపాల్ జేవీఎస్.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి విద్యార్థి మృతి



భాస్కరరావు మృతదేహం

రాజాం సిటీ: నీ కుమారుడు పాఠశాలలో అందరికంటే బాగా చదువుతున్నాడు. చదువు మధ్యలో నిలిపివేయకుండా చదివించమ్మ అని ఉపాధ్యాయులు అంటుంటే ఆ తల్లి ఉబ్బితబ్బిబ్బయ్యేది. చదువులో చురుగ్గా ఉన్న కుమారుడు ప్రయోజకుడై ఆదుకుంటాడనుకుంటుండగా కుమారుడు అకాల మరణం చెందాడన్న విషయం తెలుసుకున్న ఆ తల్లి జీర్ణించుకోలేక గుండెలవిసేలా రోదిస్తోంది. ఈ విషాదకర ఘటన రాజాం మండల పరిధి కంచరాం గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పుల్లేటికుర్తి కృష్ణవేణికి బిడ్డ పుట్టిన ఏడాదికే ఆమె భర్త మరణించాడు. అప్పటి నుంచి కృష్ణవేణి ఓ జ్యూట్‌ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఒక్కగానొక్క కుమారుడు భాస్కరరావు (14)ను అల్లారుముద్దుగా పెంచుతూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదివిస్తోంది. ఆదివారం సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలిసి భాస్కరరావు రాజయ్యపేట గ్రామ సమీపంలోని రాజుగారి కోనేరులో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోతుండగా అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కాపాడే ప్రయత్నం చేశారు. భాస్కరరావును ఒడ్డుకు తీసి సపర్యలుచేసిన అనంతరం రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో తల్లితో పాటు ఇతర కుటుంబసభ్యులు లబోదిబోమంటూ గుండెలు బాదుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై జనార్దనరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ

- గజపతినగరం బాలికోన్నత పాఠశాలకు రెండవ బహుమతి

గజపతినగరం: జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గజపతినగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిప్పాడ రమేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి బహుమతి సాధించిన విద్యార్థినులను అభినందిస్తూ ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. విజయనగరం జిల్లా కేంద్రంలో నవంబరు 1న జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శన జరిగిందని ఈ ప్రదర్శనలో గజపతినగరంలోని పురిటి పెంట బాలికోన్నత పాఠశాల నుంచి సాయిశ్రుతి, జస్మితలు వారి గైడ్ సుజాత సహకారంతో ప్రాజెక్ట్ తయారుచేసి ప్రదర్శించి రెండవ బహుమతిని గెలుచుకున్నారని వివరించారు.

ఇందుకు గాను ఆ విద్యార్థినులను హెచ్ఎం రమేష్ కుమార్‌తో పాటు ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఆగని ఘీం‘కరి’ంపు

- కొబ్బరి పంట ధ్వంసం
- రూ.10 లక్షల ఆస్తి నష్టం
- లబోదిబో మంటున్న బాధిత రైతులు
- ఆందోళనలో జిల్లా ప్రజలు



గదబవలస సమీపంలో రహదారిపై సంచరిస్తున్న ఏనుగులు

పార్వతీపురం టౌన్:

జిల్లాలో గజరాజులు బీభత్సం సృష్టిస్తున్నాయి. జనావాసాల మధ్య సంచరిస్తూ. స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. యథేచ్ఛగా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగుల దాడి కారణంగా ప్రాణనష్టం కూడా సంభవిస్తున్న నేపథ్యంలో 'మన్యంజిల్లా' ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ముఖ్యంగా గజరాజులు సంచరిస్తున్న గ్రామాల్లో ఒంటరిగా బయటకు వెళ్లలేకపోతున్నారు. పొలాలకు వెళ్లేదుకు కూడా రైతులు సాహసించడం లేదు. ఇటీవల పార్వతీపురం మండలంలో ఓ వృద్ధుడు గజరాజులకు చిక్కి విగతజీవిగా మారిన సంగతి తెలిసిందే. శనివారం రోడ్డుపై వెళ్తున్న ఓ ఆటోపై ఏనుగులు దాడి చేశాయి. ఆదివారం నర్సిపురం గ్రామ సమీపంలో 5 ఎకరాల కొబ్బరి తోటను ధ్వంసం చేశాయి. ఇప్పటికే ఏనుగుల వల్ల మృతిచెందిన వారి సంఖ్య 13కు చేరింది. రానున్న రోజుల్లో మృతుల సంఖ్య మరింత పెరగకముందే తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో ఏనుగుల సంచారం ఇలా...

జిల్లాలో ప్రస్తుతం పార్వతీపురం మండలం హెచ్ కారాడవలస పరిసరాల్లో ఏడు, భామిని మండలం శివ్వాం కొండల ప్రాంతాల్లో మరో నాలుగు ఏనుగులు సంచరిస్తున్నాయి. నాగావళి నదీతీరం దాటుకుని గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోనూ ఆ ఏడు ఏనుగులు సంచరిస్తుండడంతో ఈ ప్రాంతవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకప్పుడు తోటలు, పంట పొలాల్లో సంచరించే గజరాజులు ప్రస్తుతం రహదారులు, జనావాసాల్లో తిరుగుతుండడంతో హడలెత్తిపోతున్నారు. అవి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే వాటి వల్ల ఏటా పంటలను నష్టపోతున్న రైతులు ప్రాణనష్టం సంభవించకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రకటనకే పరిమితమైన ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కర్ణాటక రాష్ట్రంలో ఉన్న కుంకి ఏనుగులను రప్పించి, మన్యంలో బీభత్సం సృష్టిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కల్యాణ్ రెండుసార్లు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించారు. పార్వతీపురం మన్యం జిల్లాకు రెండు కుంకి ఏనుగులను దసరా పండుగలోపు తీసుకువస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమని బాధిత గ్రామస్తులు, బాధిత కుంటుబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి



ప్రభుత్వం తక్షణమే స్పందించి, కర్ణాటక రాష్ట్రం నుంచి కుంకి ఏనుగులను రప్పించి, మన్యం జిల్లాలో రెండు జట్లుగా సంచరిస్తూ బీభత్సం చేస్తున్న ఏనుగులను అడవికిగాని, సంరక్షణ కేంద్రాలకుగాని తరలించేలా చర్యలు తీసుకోవాలి. ఏనుగుల దాడిలో చనిపోయిన వారందరికీ నష్టపరిహారం చెల్లించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే విధంగా తగు చర్యలు చేపట్టాలి.

–ఎం. కృష్ణమూర్తి,
రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు